వరి సాగు తగ్గలేదు

- 'నమస్తే తెలంగాణ' కథనానికి వ్యవసాయ శాఖ వివరణ

హైదరాబాద్, డిసెంబర్ 8(నమస్తే తెలంగాణ): గత వానకాలంతో పోల్చితే ఈ వానకాలంలో వరి సాగు ఉత్పత్తి తగ్గలేదని వ్యవసాయ శాఖ డైరెక్టర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం 'నమస్తే తెలంగాణ'లో 'పెరిగిందెక్కడ? తగ్గుడే' శీర్షికన ప్రచురితమైన వార్తకు వివరణ ఇచ్చారు. గత వానకాలం సీజన్‌లో 65.92 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, 144.85 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అయినట్టు పేర్కొన్నారు. ఈ వానకాలంలో తుది అంచనాల ప్రకారం 66.78 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, 156.26 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అయినట్టు వెల్లడించారు. బియ్యం ఉత్పత్తి గతంలో 97.65 లక్షల టన్నులు ఉండగా, ఈ సీజన్‌లో 103.61 లక్షల టన్నులు ఉత్పత్తి అయినట్టు వివరించారు.

ఫీజు బకాయిలు చెల్లించాలి

- బీసీ నేత ఆర్ కృష్ణయ్య డిమాండ్
- సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ

హైదరాబాద్, డిసెంబర్8 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని, లేకుంటే 10వ తేదీన కలెక్టర్లు, ఎమ్మార్వో కార్యాలయాలను ముట్టడిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాసి మీడియాకు విడుదలచేశారు. బకాయిలు చెల్లించాలని రాష్ట్రంలోని 1800 కాలేజీలు బంద్ చేపట్టాయని, అయినా సర్కారు స్పందించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఇలాంటి పరిస్థితి గతంలో ఎప్పుడూ చూడలేదని మండిపడ్డారు. అనేక స్కీములు, కాంట్రాక్టర్లకు వేలకోట్ల బిల్లులు చెల్లిస్తున్న ప్రభుత్వం వద్ద.. విద్యార్థుల మెస్ బిల్లులు, స్కాలర్‌షిప్‌లు చెల్లించేందుకు బడ్జెట్ లేదా? అని ప్రశ్నించారు. రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా 16.75 లక్షల మంది విద్యార్థులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. ఉన్నతవిద్య, ఉద్యోగావకాశాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ల ముట్టడిలో విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

వ్యక్తి ప్రాధాన్యంగా విజయోత్సవాలా!

- పార్టీ పాలసీ ఒకటైతే మీరు చేస్తున్నదేమిటి?
- ముఖ్యనేతను నిలదీసిన సీనియర్ మంత్రి
- పునరంకిత సభల స్థానంలో స్వోత్కర్ష సభలా అంటూ మండిపాటు
- ఇవి వ్యక్తిగత ఇమేజ్‌ను పెంచుకునే సభలని అసంతృప్తి
- ప్రగతి నివేదికలపై సీనియర్ మంత్రుల సహాయ నిరాకరణ
- వ్యవసాయ శాఖ నుంచి వెల్లడి కాని ప్రగతి నివేదిక

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): ఏడాది పాలన పూర్తి చేసుకున్నప్పుడు పునరంకిత సభలు పెటుకోవడం కాంగ్రెస్ పార్టీ ఆనవాయితీ అని, కానీ రాష్ట్రంలో విజయోత్సవ సభల పేరుతో వ్యక్తిగత గొప్పలు, స్వోత్కర్ష వేదికలుగా మారుస్తున్నారని సీనియర్ కాంగ్రెస్ మంత్రి ఒకరు ముఖ్యనేతకు ఎదురు తిరిగినట్టు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. ఇది పార్టీ పాలసీకి విరుద్ధమని తెగేసి చెప్పినట్టు సమాచారం. కాసు బ్రహ్మానందరెడ్డి హయాంలో పునరంకిత సభలు పెట్టారని.. ఆ సంస్కృతిని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కొనసాగించారని ఆయన గుర్తు చేసినట్టు అత్యంత విశ్వసనీయ వ్యక్తుల ద్వారా తెలిసింది. ఈ మేరకు ఇటీవల ఓ జిల్లాలో జరిగిన బహిరంగ సభ అనంతరం సీనియర్ మంత్రి తన అసంతృప్తి వెళ్లగక్కినట్టు తెలిసింది. పాలనా వైఫల్యాలపై ఆత్మ విమర్శ చేసుకుంటూ.. సాధించిన విజయాలను ప్రజలకు చెప్పుకుంటూ, ఇందిరమ్మ స్ఫూర్తితో మరింత మెరుగైన పాలనకు దిశానిర్దేశం చేసుకోవటం కోసం పునరంకిత సభలు జరుగుతాయని సదరు మంత్రి గుర్తు చేసినట్టు తెలిసింది. ఆ దిశగా ఇప్పటి వరకు ఒక్క సభ కూడా జరుగలేదని, కేవలం వ్యక్తి ప్రాధాన్య సభలు మాత్రమే జరుగుతున్నాయని, దేవుండ్ల మీద ఒట్లు, కేసీఆర్‌కు తిట్లు అన్నట్టు తప్ప కాంగ్రెస్ పార్టీని, భవిష్యత్తు పరిపాలనను పరిపుష్టి చేసుకునే విధంగా ఒక్క సభ కూడా సాగలేదని ఆయన తన అసంతృప్తిని వ్యక్తం చేసినట్టు గాంధీ భవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ పార్టీ నేతగా తాను ఇటువంటి సభలను సమర్థించలేనని తెగేసి చెప్పినట్టు తెలిసింది.

తప్పుడు సమాచారంతో ప్రజల్లోకి వెళ్లలేం

ఏడాది పాలన ప్రగతి నివేదికలు రూపొందించటంపై కూడా సీనియర్ మంత్రులు తమ సహాయ నిరాకరణ తెలియ చేసినట్టుగా తెలుస్తోంది. ఏడాది పాలనలో ఏమి అభివృద్ధి సాధించామని ప్రగతి నివేదికలు తయారు చేయాలని, తప్పుడు సమాచారంతో కూడిన ప్రోగ్రెస్ రిపోర్టులను తీసుకొని ప్రజల్లోకి వెళ్లి అభాసుపాలు కాలేమని ఐదుగురు సీనియర్ మంత్రులు తెగేసి చెప్పినట్టు నిర్దిష్టంగా తెలిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత కీలకంగా భావిస్తున్న వ్యవసాయశాఖ నుంచి ఇప్పటి వరకు ప్రగతి నివేదిక బహిర్గతం కాకపోవటంతో ముఖ్యనేత, సీనియర్ మంత్రుల మధ్య సంవాదం జరిగిందనే వాదనకు బలాన్నిస్తోంది. ఈ మేరకు ఏడాది పాలనపై ప్రోగ్రెస్ రిపోర్టును ప్రజల ముందు ఉంచాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, చేసిన ఖర్చు తదితర సమగ్ర వివరాలతో ప్రోగ్రెస్ రిపోర్టు తయారు చేయాలని సూచలిచ్చినట్టు సమాచారం. విపక్షాల విమర్శలకు కౌంటర్ ఇచ్చే విధంగా ప్రోగ్రెస్ రిపోర్టు ఉండాలని ముఖ్య నేత దిశానిర్దేశం చేసినట్టు గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత కీలకంగా భావిస్తున్న వ్యవసాయం, సివిల్ సప్లై, నీటిపారుదల, రోడ్లు భవనాల శాఖలకు చెందిన మంత్రులు ప్రగతి నివేదికలు ఇవ్వటానికి ఇప్పటి వరకు ముందకు రాలేదు. రూ 2 లక్షల రుణ మాఫీ పూర్తి అయిందని ప్రభుత్వం ప్రకటించగా.. తమకు రుణమాఫీ కాలేదంటు వేల కొద్ది రైతు కుటంబాలు రోడ్డెక్కుతున్నాయి. రైతులకు, కౌలు రైతులకు ఎకరానికి రూ.15,000, వ్యవసాయ కూలీలకు రూ.12,000, రైతు భరోసా మీద ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన చేయలేకపోతున్న నేపథ్యంలో ప్రగతి నివేదికలు ఎలా ఇవ్వాలని సదరు శాఖ మంత్రి ముఖ్యనేత వద్ద తన నిస్సహాయతను వ్యక్తం చేసినట్టు తెలిసింది.

ఉడికిపోతున్న ఉత్తమ్

నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల నుంచి ఇప్పటి వరకు ప్రగతి నివేదికలు బహిర్గతం చేయలేదు. ఈ రెండు శాఖలకు ఒకే సీనియర్ మంత్రి ఉండటం గమనార్హం. సదరు మంత్రికి, ముఖ్య నేతకు మధ్య అసలు పొసగటం లేదని గాంధీభవన్ వర్గాలే చెప్తున్నాయి. ముఖ్య నేత కార్యాలయం నుంచి వచ్చే ఆదేశాలను ఆయన పెడచెవిన పెడతారని, తన శాఖలో వేరొకరు వేలు పెట్టడానికి ఇష్టపడరనే ఆరోపణలు ఉన్నాయి. ఏడాది పాలనలో నీటిపారుదల రంగాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేసిందనే అభిప్రాయంతో సదరు మంత్రి ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఒక్క సాగునీటి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయటం కానీ, పురోగతిలో ఉన్న ప్రాజెక్టుకు నిధులు కేటాయించటం కానీ చేయలేదని, కేవలం లగచర్ల పారిశ్రామిక కారిడార్‌ను దృష్టిలో పెట్టుకొని మొదలు పెట్టిన కొడంగల్ లిఫ్ట్ పనులకు మాత్రమే నిధులు ఇవ్వటంతో సదరు శాఖ మంత్రి తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెట్టి విచారణకు ఆదేశించటం మినహా.. కుంగిన రెండు పిల్లర్లను రిపేర్ చేయటానికి నిధులు కేటాయించలేదు. ఈ నేపథ్యంలో తాను ఎటువంటి ప్రగతి నివేదికలు పట్టుకొని ప్రజల ముందుకు వెళ్లాలని సదరు మంత్రి ప్రశ్నించినట్టు తెలిసింది. రోడ్లు భవనాల శాఖ నుంచి కూడా ఏడాది పాలన మీద ఇప్పటి వరకు ప్రోగ్రెస్ రిపోర్టు వెల్లడి కాలేదు. ఆ శాఖలో కొత్తగా వేసిన రోడ్లు ఏమీ లేకపోవటం, కనీసం పాత రోడ్లను రిపేర్ చేయడానికి నిధులు కేటాయించక పోవటంతో సదరు మంత్రి ప్రోగ్రెస్ రిపోర్టును ప్రజల ముందు ఉంచకుండా ముఖం చాటేశారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మళ్లీ వీఆర్వో వ్యవస్థ

- పాత వీఆర్వోలు, వీఆర్‌ఏల సర్దుబాటు
- గ్రామ రెవెన్యూ అధికారులుగా పునరుద్ధరణ
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): మళ్లీ వీఆర్వో వ్యవస్థను తీసుకొస్తామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. గతంలో వివిధ శాఖల్లోకి సర్దుబాటైన వీఆర్వోలు, వీఆర్‌ఏల్లో ఎంపికచేసిన వారిని మళ్లీ 10,954 రెవెన్యూ గ్రామాల్లో నియమిస్తామని చెప్పారు. మరో వెయ్యి మందిని సర్వే సెటిల్‌మెంట్ విభాగంలోకి తీసుకుంటామని తెలిపారు. సచివాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. నూతన ఆర్వోఆర్ చట్టాన్ని అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెడతామని ప్రకటించారు. 18 రాష్ట్రాల్లో అధ్యయనం చేసి అక్కడ అమలవుతున్న మంచి అంశాలను నూతన చట్టంలో పొందుపరిచామని తెలిపారు. ఏడాది కాలంలో ధరణి పోర్టల్ ప్రక్షాళనకు అవసరమైన అనేక చర్యలు చేపట్టినట్టు తెలిపారు.

నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఎన్ని రోజులు సభ నిర్వహించాలో సోమవారం జరుగనున్న బీఏసీ సమావేశంలో నిర్ణయించనున్నారు. ఈ సమావేశాల్లో ప్రధానంగా నూతన ఆర్వోఆర్ చట్టాన్ని ప్రవేశపెట్టనున్నారు. కొత్తగా గ్రామ రెవెన్యూ వ్యవస్థను తిరిగి ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో అందరి దృష్టి ఈ బిల్లుపైనే ఉన్నది. దీంతోపాటు తెలంగాణ వైద్యవిధాన పరిషత్తును ప్రభుత్వంలో విలీనం చేసి సెకండరీ హెల్త్ డైరెక్టరేట్‌గా మార్చే బిల్లును సైతం ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్టు వైద్యవర్గాలు తెలిపాయి. సమావేశాల ఏర్పాట్లపై ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీస్ శాఖతో అసెంబ్లీలోని స్పీకర్ చాంబర్‌లో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. సమావేశాలకు రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సహకరించాలని కోరారు. సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని సూచించారు. కౌన్సిల్ చైర్మన్ సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రొటోకాల్ విషయంలో వివాదాలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సభ సజావుగా సాగేందుకు సహకరిస్తామని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. కార్యక్రమంలో మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు, సీఎస్ శాంతికుమారి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకృష్ణారావు, రవిగుప్తా, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, జీఏడీ కార్యదర్శి రఘునందన్‌రావు, డీజీపీ జితేందర్, ఏడీజీ మహేశ్ భగవత్ తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు చర్చకు వచ్చే అంశాలు

1) జీతాలు, పింఛన్ల చెల్లింపు, అనర్హతల తొలగింపు (సవరణ) ఆర్డినెన్స్ 2024
2) తెలంగాణ పురపాలక సంఘాల (సవరణ) ఆర్డినెన్స్ 2024
3) హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (సవరణ) ఆర్డినెన్స్ 2024
4) తెలంగాణ వస్తువుల, సేవల పన్ను (సవరణ) ఆర్డినెన్స్ 2024
5) 2022-23 సంవత్సరానికి గాను తెలంగాణ విద్యుత్తు ఆర్థిక సంస్థ లిమిటెడ్ 9వ వార్షిక నివేదిక
6) 2021-22 సంవత్సరానికిగాను రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ లిమిటెడ్ 7వ వార్షిక నివేదిక
7) తెలంగాణ పంచాయతీరాజ్ (సవరణ) ఆర్డినెన్స్ 2024

ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

క్రీడాకారులతో విప్ లక్ష్మణ్ కుమార్

ధర్మారం, డిసెంబర్ 8 : మండలంలోని కమ్మర్‌ఖాన్ పేటలో ఆదివారం ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. కమ్మర్ ఖాన్ పేట యూత్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి 40 జట్లు ఈ పోటీల్లో పాల్గొనడానికి నమోదు చేసుకోగా, విన్నర్ జట్టుకు రూ. 30వేలు, రన్నర్ జట్టుకు రూ.15వేలు, మూడవ, నాలుగో స్థానాల్లో నిలిచిన జట్లకు చెరో రూ. 2,500 చొప్పున నగదు బహుమతి ఇస్తామని టోర్నమెంట్ నిర్వాహకులు ప్రకటించారు. ఈ క్రమంలో ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపోటములు సహజమని క్రీడాస్ఫూర్తితో క్రికెట్ ఆడి తమ సత్తా చాటాలని క్రీడాకారులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూత్ ఆర్గనైజర్ గుజ్జేటి రాజు, ఏఎంసీ చైర్మన్ ఎల్ రూప్ల నాయక్, గ్రామ మాజీ ఉప సర్పంచి గుజ్జుల వేణుగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, పార్టీ నాయకులు కొత్త నరసింహం, కాడే సూర్యనారాయణ, సోగాల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

శరీర దానానికి సదాశయ ఫౌండేషన్‌తో రిటైర్డ్ హెచ్ఎం దంపతుల ఒప్పందం

అభినందించిన ఎంఈవో సురేందర్‌కుమార్, సహచర హెచ్ఎంలు, ఉపాధ్యాయులు

దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దపల్లి రూరల్, డిసెంబర్ 8 : మండలంలోని గుర్రాంపల్లిలో హెచ్ఎంగా పని చేసిన నేదునూరి కనుకయ్య దంపతులు శరీరదానానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. కాగా, శనివారం వారిని ఎంఈవోతో పాటు పలువురు సహచర ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. మండలంలోని గుర్రాంపల్లిలో హెచ్ఎం నేదునూరి కనుకయ్య ఉద్యోగ విరమణ పొందాడు. ఈ సందర్భంగా కనుకయ్యకు గుర్రాంపల్లి పాఠశాలలో ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హెచ్ఎంతో పాటు ఆయన సతీమణి రేణుకను కూడా కార్యక్రమానికి ఆహ్వానించి సన్మానించారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి ఎంఈవో సురేందర్ కుమార్‌ను ముఖ్యఅతిథిగా ఆహ్వానించగా, పాఠశాల హెచ్ఎంగా కనుకయ్య పాఠశాలలో చేసిన సేవలను గ్రామస్తులు, వక్తలు కొనియాడుతూ శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో బృందం పాఠశాలకు చేరుకుని కనుకయ్య-రేణుక దంపతులతో శరీరదానానికి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆగయ్య, పెద్దపల్లి సింగిల్ విండో చైర్మన్ మాదిరెడ్డి నర్సింహారెడ్డి, టీపీటీఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు పోచయ్య, ప్రధాన కార్యదర్శి పర్శరాములు, ఉపాధ్యక్షుడు రాజనర్సు, మారెడుగొండ హెచ్ఎం జానకీదేవి, మాజీ ఎంపీటీసీలు మాదిరెడ్డి తిరుపతిరెడ్డి, మూల మహేందర్‌రెడ్డి, సహచర మిత్రులు రాజయ్య, నర్సయ్య, కిష్టయ్య పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులకు సన్మానం

పెద్దపల్లి, డిసెంబర్8: పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు త్రిరి తిరుపతి గౌడ్, సీజీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జెక్కె శ్రీనివాస్‌గౌడ్‌ను వాకర్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆదివారం కరీంగనర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో సన్మానించారు. అలాగే వాకర్స్ ఇంటర్నేషనల్ సభ్యత్వం ఇస్తూ చార్టర్ సర్టిఫికేట్ అందజేశారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ జోనల్ గవర్నర్ ఎల్లాగౌడ్, కే భారతి, శ్రీనివాస్ గౌడ్, సుధాకర్ రావు, బుర్ర జగదీశ్వర్ గౌడ్, రవీందర్, రమణారెడ్డి, రాజు, వెంకటరెడ్డి, కిషన్ రావు, రవీందర్ రెడ్డి, కన్నం శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.

సిమ్స్ వైద్య విద్యార్థుల ప్రతిభ

ఫర్టిలైజర్‌సిటీ, డిసెంబర్ 8 : చండీగర్ రాజధానిలో ఈ నెల 4 నుంచి-7వరకు జరిగిన 50వ జాతీయ బయో కెమెస్ట్రీ సదస్సులో రామగుండంలోని సింగరేణి వైద్య కళాశాల రెండో సంవత్సరం విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారు. కళాశాల బయోకెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అశోక్ వర్దన్ ఆధ్వర్యంలో విద్యార్థులు సల్వాజీ రిషిరావు, హర్షవర్దన్, సాత్విక్, అభిరామ్, సుదీప్, సృజన, అనూష న్యూరో బయో కెమిస్ట్రీ విట మిన్-డీ, హెవీ మెంటల్ టాక్సిసిటీపై చేసిన పరిశోధనలను సదస్సులో ప్రదర్శించగా జాతీయ, అంతర్జాతీయ శాస్త్రవేత్తలు, నిపుణుల నుంచి అభినందనలు అందుకున్నారు. జాతీయ స్థాయిలో విద్యార్థుల ప్రతిభపై సిమ్స్ వైద్య కళాశాలకు గర్వకారణంగా నిలిచారని, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు సింగ్, అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు.

వసతిగృహాల్లోని సమస్యలు పరిష్కరించాలి

- శాతవాహన యూనివర్సిటీ బీఆర్ఎస్వీ ఇన్‌చార్జి, గురుకుల బాట జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్

మాట్లాడుతున్న చుక్క శ్రీనివాస్

పెద్దపల్లి, డిసెంబర్ 8 : కాంగ్రెస్ ప్రభుత్వానికి విద్యార్థులపై చిత్తశుద్ధి ఉంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బడుగు బలహీన వర్గాల వసతి గృహాల్లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని శాతావాహన యూనివర్సిటీ బీఆర్ఎస్వీ ఇన్‌చార్జి, గురుకుల బాట జిల్లా ఇన్‌చార్జి చుక్క శ్రీనివాస్, జిల్లా కో-ఆర్డినేటర్ కొయ్యాడ సతీశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు.. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన గురుకుల బాట కార్యక్రమం విజయవంతమైందన్నారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యావ్యవస్థలను రేవంత్ రెడ్డి సర్కారు నిర్వీర్యం చేసిందని విమర్శించారు. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనార్టీ బడుగు బలహీన వర్గాల వసతి గృహాలను బీఆర్ఎస్వీ నాయకుల ఆధ్వర్యంలో పరిశీలిస్తుండగా, వసతి గృహాల్లోని విద్యార్థులు వారి వారి సమస్యలను చెప్పుకుంటూ కంటతడి పెట్టుకున్నారని తెలిపారు. సొంత భవనాలు లేకుండా అద్దె భవనాల్లో వసతిగృహాలను నిర్వహిస్తుండడంపై తరగతి గదులు ఇరుకు ఇరుకుగా ఉండడంతో అసౌకర్యంగా, వంట గదులు లేకుండా ఉన్నాయని పేర్కొన్నారు. వంట గది లోని సరుకులను అక్కడక్కడ పురుగులు కొడుతూ ఎలుకలు కోడుతూ అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. వసతి గృహాల్లో నీటి సౌకర్యం లేదని, కాంట్రాక్టర్లు నాణ్యమైన సరుకులు సరఫరా చేయడం లేదు వసతి గృహాల్లో బాత్రూమ్స్ లేవని, ఉన్న బాత్రూమ్స్‌కు డోర్లు లేని పరిస్థితి ఉందన్నారు. విద్యార్థులకు బ్లాంకెట్స్ సరఫరా చేయలేదని, షూ ఇవ్వలేదని విద్యార్థులు చెప్పారన్నారు. రేవంత్‌రెడ్డి సర్కారు ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనార్టీ బడుగు బలహీన వర్గాలను విద్యకు దూరం చేయాలనే కుట్ర చేస్తుందన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులు చనిపోతున్న అనారోగ్యం పాలవుతున్న స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు కానీ, వసతి గృహాలను సందర్శించి విద్యార్థులకు భరోసా కల్పించిన పాపాన పోలేదని దుయ్యబట్టారు. సుల్తానాబాద్ పట్టణంలో ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహాన్ని పరిశీలనకు వెళ్లగా స్థానిక ఎస్సై బీఆర్ఎస్ విద్యార్థి నాయకులను అరెస్టు చేసి, పోలీస్ స్టేషన్ తరలించి కేసులు నమోదు చేశారని తెలిపారు. రాష్ట్రంలోని గురుకుల వసతి గృహాల్లోని సమస్యలను పరిష్కరించాలని, సమస్యలను పరిష్కరించే అంతవరకు బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ జిల్లా కో ఆర్డినేటర్ బీఆర్ఎస్వీ మాజీ రాష్ట్ర కార్యదర్శి రాజోజుల శివ, జిల్లా నాయకులు ఉప్పు శివ పటేల్, నాయిని అన్వేశ్, గోవర్ధనాచారి, బోయిని మనోజ్, కుక్క మనోజ్ పాల్గొన్నారు.

మృతదేహానికి రీ పోస్ట్‌మార్టం

ముత్తారం, డిసెంబర్ 8 : మండలంలోని లక్కారం గ్రామానికి చెందిన వెల్పుల కొమురమ్మ (60) గత నెల నవంబర్ 5న మృతి చెందింది. ఆమె మృతిపై అనుమానాలున్నాయని ఆమె కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు.. ఎస్ఐ గోపతి నరేశ్ కేసు నమోదు చేసి, దర్యాప్తులో భాగంగా ఆదివారం కొమురమ్మ మృతదేహానికి డాక్టర్ల సమక్షంలో రీ పోస్ట్ మార్టం చేయించారు.

టీ ఫైబర్ సేవలు ప్రారంభం

ముత్తారం, డిసెంబర్ 8: రాష్ట్రంలోని ప్రతి ఇంటికి ఇంటర్నెట్ సేవలను టీ ఫైబర్ ద్వారా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఐటీ పరిశ్రమ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. అదివారం ఫైలట్ ప్రాజెక్ట్ కింద 3 గ్రామాలకు పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శితో కలిసి టీ ఫైబర్ సేవలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అరుణశ్రీ, డీపీవో వీర బుచ్చయ్య, జడ్పీ సీఈవో నరేందర్, మంథని ఆర్డీవో సురేశ్, తహసీల్దార్ సుమన్, ఎంపీడీవో సురేశ్, ఎంపీవో గోవర్ధన్, టీ ఫైబర్ జోనల్ మేనేజర్ సుభాన్, టీ ఫైబర్ జిల్లా ఇన్‌చార్జి సంపత్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండలా ధ్యక్షుడు బాలాజీ, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య, మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడు వాజీద్ పాషా, కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ గీతారాణి పాల్గొన్నారు.

ఊరేగింపులో కోలాటం ఆడుతున్న మహిళలు

వైభవంగా మల్లికార్జున స్వామి శోభాయాత్ర

కమాన్‌పూర్, డిసెంబర్ 8 : మండలంలోని జూలపల్లిలో పర్వతాల మల్లికార్జున స్వామి శోభాయాత్ర ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం గ్రామ శివారు లోని పర్వతాల మల్లికార్జున స్వామి ఆలయంలోని స్వామివారి ఉత్సవ విగ్రహాలను మేళతాళాల మధ్య ఆలయ నిర్వాహకులైన ఎలబోయిన అమ్మక్క, తిరుపతి ఇంటికి తీసుకెళ్లారు. అక్కడ గంగా జలాలతో ఉత్సవ విగ్రహాలకు జల స్నానం ఆచరణ చేసి, పల్లకీలో ఊరేగించారు. దారి వెంట మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికి స్వామివారిని దర్శించుకున్నారు. అనం తరం ఉత్సవ మూర్తులను ఒగ్గు పూజారులు తిరిగి ఆలయంలో పున:ప్రతిష్ఠించారు. ఇక్కడ షష్టి వారాలు ప్రారంభంలో ఏడాది పర్వతాల మల్లికార్జున స్వామి శోభాయాత్ర ఆనవాయితీగా వస్తుంది. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య, శ్రీనుబాబు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ బోనాలు

కాల్వశ్రీరాంపూర్, డిసెంబర్ 8 : మండలంలోని పందిళ్లలో పెద్దమ్మతల్లి బోనాల పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కులస్తులు ఇంటికో బోనం వండి, మహిళలు నెత్తిన బోనపుకుండలతో డప్పు చప్పుళ్ల మధ్య, శివసత్తుల పూనకాలతో బయలుదేరి పెద్దమ్మతల్లి ఆలయానికి చేరుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించారు. పిల్లాపాప సల్లంగా, పాడి పంటలు సంమృద్ధిగా పండాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు దాసరి మల్లేశ్, ఉపాధ్యక్షుడు కందుల మల్లేశ్, కార్యదర్శి బండి రవి, సభ్యులు మహేశ్, లక్ష్మణ్, సుధాకర్, కొమురయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గ